క్లుప్తంగా

అడివయ్య స్వామికి పూజలు

అట్లూరు : అట్లూరు క్రాస్ రోడ్డు వద్దనున్న శ్రీఅడివయ్య స్వామి మఠంలో సోమవారం ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో అడివయ్య స్వామి భక్త బృందం పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్ఈసీ మెంబర్‌కు సన్మానం



రాజగోపాల్‌రెడ్డి, కేశవరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యులుగా నియమితులైన మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డిని సోమవారం నెల్లూరురోడ్డులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన గాజులపల్లె కేశవరెడ్డిని కూడా నాయకులు సన్మానించారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని బాణసంచా దుకాణాలను సోమవారం రాత్రి సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తనిఖీ చేశారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకున్నారా? లేదా పరిశీలించారు. దుకాణ యజమానులు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. లైసెన్స్ పొందిన ప్రదేశంలోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయరాదని, షాపుల వద్ద ఇసుక బకెట్లు, నీటి తొట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఉంచాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా వైరింగ్ చక్కగా ఉండాలన్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అనుమతి లేకుండా టపాసులు నిల్వ చేయడం, విక్రయించడం నేరమన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

ప్రొద్దుటూరు : అన్నదానం పుణ్యకార్యమని, అన్న ప్రసాద సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగల రాజశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన భార్య సునీత శేఖర్ (స్పందన), కూతురు ప్రత్యూష, అల్లుడు వినయ్ కుమార్‌రెడ్డి, మనుమలు అవ్యక్ అరవ్‌ల సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించినట్లు తెలిపారు.

పేదలకు భూములు పంచండి

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామ సమీపంలో ఉన్న భూములను పేదలకు పంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, మండల సీపీఎం నాయకులు పోలయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అటవీ భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని చెప్పారు. భూ పంపిణీ చేయాలంటూ గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు.

ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి సత్కారం



గోవిందరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు


పోరుమామిళ్ల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ (సీఈసీ)గా నియమితులైన సందర్భంగా సోమవారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో పలువురు ఆయన్ను సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సింగమాల వెంకటేశ్వర్లు, సింగల్‌విండో మాజీ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, సర్పంచ్ వీరభద్రుడు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వెంకటయ్య, కార్తిక్ తదితరులు ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

స్వచ్ఛ పంచాయతీగా బేతాయపల్లె

గోపవరం : మండలంలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా బేతాయపల్లె ఎంపికైంది. ఈ మేరకు సోమవారం కడపలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతులమీదుగా సర్పంచ్ లక్ష్మిదేవి, ఈఓపీఆర్‌డీ హసీనా, గ్రామ పంచాయతీ సెక్రటరీ వీరశేఖర్‌రెడ్డిలు అవార్డు అందుకున్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో జిల్లా అవార్డు బేతాయపల్లె పంచాయతీకి దక్కడం పట్ల కలెక్టర్ అభినందించారు. స్థానికుల సహకారంతో ఈ అవార్డును అందుకున్నట్టు సర్పంచ్ లక్ష్మిదేవి తెలియజేశారు. గ్రామ పంచాయతీ మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

వరికి తెగులు.. రైతుకు దిగులు

- అదుపులోకి రాని తెగుళ్లు
- దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో అన్నదాత



మేకవారిపల్లెలో తెల్లతెగులు సోకిన వరిపంట

బి.కోడూరు : వ్యవసాయమే జీవనధారంగా బతుకుతున్న రైతన్నకు అటు ప్రకృతి ఇటు చీడపీడలతో కష్టాలు తప్పడం లేదు. నాట్లు వేసింది మొదలు పంట చేతికొచ్చి విక్రయించే వరకు అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి. అకాల వర్షాలు, తెగుళ్ల దిగుబడిపై ప్రభావం చూపుతున్నా రైతులు మాత్రం రెక్కల కష్టాన్ని, భూతల్లిని నమ్ముకుంటున్నాడు. రెండేళ్లుగా మండలంలో సరైన వర్షపాతం నమోదుకాకపోయినప్పటికీ పశుగ్రాసం కోసం, తిండి గింజల కోసం ఈ ఏడాది మండలంలో బోరుబావుల కింద రైతులు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరిపంటను సాగు చేశారు. కానీ వరిపంట వెన్ను, పొట్ట, కరకు దశలో ఉంది. ఇప్పటివరకు పంట అంతా కూడా ఆశాజనకంగా ఉండటంతో నాలుగు కాసులు వెనకేసుకోవచ్చు అనుకున్న రైతుల ఆశలు అడియాశలుగా మారాయి. ప్రస్తుతం మండలంలో వరిపంటకు తెల్లతెగులు వ్యాపించి పంట అంతా నిలువునా ఎండిపోతుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక ఎకరా సాగు చేయాలంటే సుమారు రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మండలంలో వరిపంటకు సోకుతున్న తెల్లతెగులు కారణంగా దిగుబడి సగానికి సగం తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

తెగుళ్ల బెడదతో..

వరికి తెగుళ్లు సోకుతుండడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్ని రకాల రసాయనిక మందులు పిచికారి చేసినా తెగుళ్లను అరికట్టలేకపోతున్నామని వాపోతున్నారు. దీని ప్రభావం దిగుబడులపై పడుతోందని చెబుతున్నారు. పెట్టుబడి పెరగడమే కాకుండా పంట ఆశించిన స్థాయిలో ఉండకపోవడంతో దిగుబడులపై రైతన్న దిగులు పడుతున్నారు. చీడపీడలతో పంటకు భారీగా నష్టం చేకూరుతుందని సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం గగనమేనని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తెగులు సోకిన వరిపంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కర్షకులు కోరుతున్నారు.

నాలుగు ఎకరాల్లో సాగు చేశా



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో సుమారు రూ.లక్ష ఖర్చు చేసి వరిపంటను సాగు చేశాను. పంట అంతా వెన్ను దశలో ఉంది. ప్రస్తుతం వరిపంటకు తెల్లతెగులు సోకింది. దిగుబడి ఆశించినంత వచ్చే అవకాశం లేదు. నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.

గురయ్య, రైతు, ఎం.నరసింహ్మాపురం

రెండేళ్లుగా నష్టాలే



రెండేళ్లుగా వరిపంటను సాగు చేస్తున్నాను. గతేడాది గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇంట్లోనే ధాన్యాన్ని నిల్వ చేశాను. ఈ ఏడాదైనా నష్టాన్ని భర్తీ చేసుకుందామనుకుంటే తెల్లతెగులుతో దిగుబడి పూర్తిగా తగ్గేటట్లు ఉంది. ఈ ఏడాది కూడా నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది.

సుబ్బరామిరెడ్డి, రైతు, మేకవారిపల్లె

కొత్తపల్లె పంచాయతీలో అభివృద్ధి నిల్, అవినీతి ఫుల్



అధ్వానంగా మారిన మైదుకూరు రోడ్డు ఫొటోలను చూపుతున్న ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు : కొత్తపల్లె పంచాయతీలో అభివృద్ధి నిల్, అవినీతి ఫుల్ అని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ విమర్శించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తాను సర్పంచ్‌గా పంచాయతీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కోట్ల రూపాయలతో అమృతానగర్, వివేకానంద నగర్, ప్రకాష్ నగర్, గ్రీన్ ల్యాండ్స్ తదితర ప్రాంతాల్లో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నాయకత్వంలో అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎక్కడ అభివృద్ధి చేశారో సర్పంచ్ చెప్పాలన్నారు. మైదుకూరు రోడ్డును సర్పంచ్ స్వార్థం కోసం కాలువలకు అవుట్‌లెట్ లేకుండా, సరైన ప్రణాళిక లేకుండా నిర్మించారని తెలిపారు. దీని వల్ల రోడ్డుపై మురుగు నీరు, వర్షం నీరు పారుతోందన్నారు. అధికారుల సలహాలు తీసుకుని సర్పంచ్ పనిచేయాలని హితవుపలికారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న రూములకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు మార్కింగ్ ఇచ్చారన్నారు. ఆ రూములను పగులగొట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి డబ్బును, పబ్లిసిటీని వదిలి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల స్థాయి అండర్ 14, 17 బాలబాలికలకు ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలను ఈనెల 8, 9, 10 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ షేక్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో 8న చెస్, యోగా, వాలీబాల్, ఆర్‌సీపీఈ కళాశాలలో 9న ఖోఖో, కబడ్డీ, 10న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఆయా ఎంపిక కేంద్రాలలో హాజరు కావాలని సూచించారు.

క్రీడా పోటీలు వాయిదా

రాజుపాళెం : వర్షం కారణంగా రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ, బుధవారాల్లో జరగాల్సిన క్రీడా పోటీలు వాయిదా పడినట్లు ఆ పాఠశాల హెచ్ఎం వసుంధరా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే బుధ, గురువారాల్లో ఆ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడా పోటీలకు వచ్చే వారంతా గమనించాలని ఆమె సూచించారు.

చదువుతో పాటు సామాజిక స్పృహ అవసరం

ప్రొద్దుటూరు : చదువుతో పాటు విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపల్లె గ్రామం మత్స్య కాలనీలో ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 స్పెషల్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పర్యావరణ, వ్యాధులు, ఆహారం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరాముడు మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేయాలని సూచించారు. ఈ క్యాంప్ వారం రోజుల పాటు మత్స్యకాలనీలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

15న కడపలో ఎమ్మార్పీఎస్ సమావేశం

బి.కోడూరు : ఈ నెల 15న కడపలో జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండాల ఈశ్వరయ్యమాదిగ తెలిపారు. సోమవారం మండలంలోని బి.కోడూరులో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడారు. పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ఈ నెల 15వ తేదీన కడపలోని రాజేశ్వరి కళ్యాణ మండపంలో జిల్లా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కడప జిల్లాలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలను, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీల ఏర్పాటును వేగవంతం చేయాలని మండల ఇన్‌చార్జిలకు తెలియజేశారు. అనంతరం ఈ నెల 15న కడపలో జరిగే జిల్లా సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో గంగరాజు, నరసింహులు, జయచంద్ర, గురయ్య, నరసయ్య, సుబ్బయ్య, యాగప్ప, పెనుకొండ టైమ్స్ న్యూస్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జి ఎం.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితం

ప్రొద్దుటూరు కల్చరల్ : 5 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌లు ఉచితంగా చేయనున్నట్లు ప్రొద్దుటూరు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 అక్టోబర్ 1 నుంచి 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఈ సేవలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. పట్టణంలో వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్, శ్రీసాయిరాజేశ్వరి కాలనీలో శ్రీచైతన్య హైస్కూల్, హోమస్‌పేట సబ్ ఆఫీస్, జమ్మలమడుగు సబ్ ఆఫీస్, పులివెందుల హెడ్ పోస్టాఫీసులలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. పోస్టాఫీసులలో కొత్త ఆధార్ నమోదు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్, బయోమెట్రిక్ అప్‌డేట్, ఇతర వివరాల సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. తపాలా శాఖ ఆర్థిక చేరికను ప్రోత్సహించేందుకు పోస్టాఫీస్ పొదుపు బ్యాంక్ ఖాతాలు పది సంవత్సరాల లోపు ఆడ పిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను తెరుచుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన ఉండాలి

పోరుమామిళ్ల : ప్రజలకు జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ఉండాలని, విద్యార్థులు ఈ విషయంలో గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని వాణిజ్య విభాగం అధ్యాపకులు పర్వీన్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శామ్యూల్ డేవిడ్‌రాజు అధ్యక్షతన విద్యార్థులకు జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పన్నులపై అవగాహన ఉండాలని, జీఎస్టీ ఉపయోగాలు గ్రామాల్లో చెప్పాలని ప్రిన్సిపల్ చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రకాష్ రావు, వెంకటరావు, ఈశ్వరయ్య, సులోచన, రవిచంద్ర, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



వడ్డే ఓబన్నకు నివాళి అర్పిస్తున్న నాయకులు

అట్లూరు : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతిని సోమవారం ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బద్వేలు వడ్డెర కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరగదిండ్ల రమణయ్య, జిల్లా నాయకులు తురక సునీల్ మాట్లాడుతూ బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమంలో వడ్డే ఓబన్న కీలకపాత్ర పోషించారన్నారు. 1846 అక్టోబర్ 6న బ్రిటిష్ సైన్యం జరిపిన కాల్పుల్లో ఓబన్న వీరమరణం పొందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించి వడ్డెర్ల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి వృత్తిదారునికి 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని, వడ్డెర వృత్తిదారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంప నారాయణమ్మ, వెంకటసుబ్బమ్మ, నాగమణి, నరసమ్మ, బత్తల బాలయ్య, ఇండ్ల వెంకటేశు, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ దోపిడీపై ఎమ్మెల్యే స్పందించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో జరుగుతున్న దోపిడీపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్పందించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం చైర్మన్ ఛాంబర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎగ్జిబిషన్ టికెట్ పెద్దలకు రూ.35, పిల్లలకు రూ.20 ఉండగా, ఎగ్జిబిషన్ నిర్వాహకులు దసరా పర్వదినం సందర్భంగా ఎంట్రన్స్ ఫీజు పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.80 వసూలు చేశారన్నారు. మరుసటి రోజు నుంచి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50 రాబడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై తాము కమిషనర్ సంప్రదించినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వ అధికారులు అవినీతి చేయరాదని ప్రమాణాలు చేయించే వరదరాజులరెడ్డి ఆయన శిష్యులైన ఈ ఎగ్జిబిషన్ నిర్వాహకులను కట్టడి చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గత సంవత్సరం ఆయన శిష్యుడైన ఎగ్జిబిషన్ నిర్వాహకుడు మున్సిపాలిటీకి దాదాపు రూ.35 లక్షలు ఎగనామం పెట్టారన్నారు. ఈ విధంగా కోట్ల రూపాయల ప్రజల సొమ్ము దోచుకుంటుంటే ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదన్నారు. కనీసం ఈ సంవత్సరమైనా మున్సిపాలిటీకి రావాల్సిన రూ.2.25 కోట్లు వచ్చేలా ఎమ్మెల్యే చూడాలని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఎగ్జిబిషన్ ఎంట్రీ ఫ్రీ ఇచ్చినప్పుడు ధర్నా చేసిన టీడీపీ మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ స్పోర్ట్స్‌మీట్‌కు ఎంపికైన అటవీశాఖ ఉద్యోగులు



ప్రొద్దుటూరు అటవీశాఖ ఉద్యోగులు

ప్రొద్దుటూరు క్రైం : కర్నూల్ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఏపీ ఫారెస్ట్ స్పోర్ట్స్‌మీట్–2025లో ప్రొద్దుటూరు అటవీ సబ్‌డివిజన్ ఉద్యోగులు అద్భుత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు ఎంపికయ్యారు. కర్నూల్ సర్కిల్ పరిధిలోని ప్రొద్దుటూరు, కడప, కర్నూల్, నంద్యాల డివిజన్ల అటవీ ఉద్యోగులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో అద్భుత ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కడప జిల్లా తరపున ప్రొద్దుటూరు అటవీశాఖ నుంచి పాల్గొన్న సుంకయ్య 100, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే క్రికెట్ జట్టులో రమేష్, కబీర్, సురేష్, కబడ్డీలో తిరుపాల్, రమేష్, సురేష్, షాజహాన్, టగ్‌ఆఫ్‌వార్‌లో మంచి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహిళా విభాగంలో జావెలిన్ త్రో, షటిల్‌కు విజయలక్ష్మి ఎంపికయ్యారు. మంచి ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రొద్దుటూరు సబ్‌డీఎఫ్ఓ సంకేత్‌సునీల్ గరుడ్, ఎఫ్ఆర్ఓ హేమాంజలి అభినందించారు.

హామీలను విస్మరించిన పాలకులపై పోరుబాట



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు

బద్వేలు అర్బన్ : ఎన్నికల వేళ ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుబాట తప్పదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రజలందరి ఖాతాలో రూ.15 లక్షలు చొప్పున జమ చేస్తామని, ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ వర్గాలకు కట్టబెడుతోందని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, పట్టణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని చెప్పిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని తెలియజేశారు. ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహాలను ఈ నెల 16న కడపలో జరగనున్న రాయలసీమ జిల్లాల సదస్సులో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుకు సిద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి బండెల ఓబయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వేమన, జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రమణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో భారీ వర్షం



సిద్దవటం రోడ్డులో భారీగా నిలిచిన వర్షపునీరు



చెరువును తలపిస్తున్న వెంకటయ్యనగర్

- ఉప్పొంగిన డ్రైనేజీలు
- ప్రధాన రహదారుల్లో మురుగునీరు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

బద్వేలు అర్బన్ : పట్టణంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు ఉప్పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరింది. పట్టణంలోని సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, మెయిన్ బజార్, ఆంజనేయనగర్, రామాంజనేయ నగర్, శాస్త్రీ నగర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీగా మురుగునీరు చేరింది. సిద్దవటం రోడ్డులోని చికెన్ దుకాణాల వద్ద రోడ్డుకు ఇరువైపులా మోకాలిలోతు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఆయా కాలనీలలో భారీగా వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్టీసీ గ్యారేజీలోకి మోకాలిలోతు నీరు చేరింది. బస్టాండు వెనుక భాగంలోని మహబూబ్‌నగర్, మెయిన్‌బజార్‌లలో పలు ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది. పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో, వెంకటయ్యనగర్‌లలో డ్రైనేజీలు ఉప్పొంగి రోడ్లపై మురుగు పారింది. మైదుకూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం, సబ్‌స్టేషన్ లోపల, సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు కార్యాలయం ఆవరణలో భారీగా వర్షపునీరు నిలిచింది. అలాగే త్యాగరాజ కాలనీ చుట్టూ భారీగా వర్షపు నీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరింది.

ఆర్డీఓ పరిశీలన

సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఆయా కార్యాలయాలు, ప్రధాన రహదారుల్లో నిలిచిన వర్షపునీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, ఆర్టీసీ డీఎం నిరంజన్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ కూడలి జలమయం



మార్కెట్ కూడలిలో నీళ్లలోనే రాకపోకలు



అలుగు వంక వద్ద ఆక్రమణలు తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నం

మైదుకూరు : పట్టణంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో మార్కెట్ కూడలి జలమయం అయింది.

పట్టణ శివారులోని ఎర్ర చెరువు అలుగు పారడంతో ఆ నీరంతా సాఫీగా వెళ్లే దారులు లేక జాతీయ రహదారిపై మార్కెట్ కూడలిలో ప్రవహించాయి. వాహనాలు, పాదచారాలు రాకపోకలు సాగించేందుకు ఆటంకంగా మారింది. మున్సిపల్ అధికారులు అలుగు వంక ఆక్రమణలు తొలగించే ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో నామమాత్రంగా పూడికను తొలగించి చేతులు దులుపుకొన్నారు. రాత్రి వరకు నీళ్లు తగ్గకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అలుగు వంక ఆక్రమణలకు గురి కావడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు.

నేడు క్రీడా పోటీలు

అట్లూరు : స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలను ఈనెల 7, 8 తేదీలలో నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ బి.జయరామ్ నాయక్ తెలిపారు. ఈనెల 7న అట్లూరు జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ, చెస్, యోగా, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలు, 8న అథ్లెటిక్స్ విభాగంలో ఎంపికలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

పరిశుభ్రతలో మైదుకూరు డిపోకు అవార్డు



కలెక్టర్, ఆర్ఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న మైదుకూరు ఆర్టీసీ డీఎం శ్రీలత

మైదుకూరు : స్వచ్ఛ– ఆంధ్ర కార్యక్రమం అమలులో మైదుకూరు ఆర్టీసీ డిపోకు ఉత్తమ డిపోగా అవార్డు దక్కింది. పరిశుభ్రతలో జిల్లాలో మైదుకూరు డిపో ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం కడప రీజనల్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా డిపో మేనేజర్ శ్రీలత అవార్డును అందుకున్నారు. ఉత్తమ డిపోగా ఎంపిక కావడం పట్ల డిపో మేనేజర్ శ్రీలత, అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.